www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 21 ఆగస్టు 2023

నేడు కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరంలోని కలెక్టరేట్‌లో 21న జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మూడో సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి స్పందనలో రెవెన్యూ, ఇతర శాఖల అర్జీలతో పాటు పోలీసు శాఖకు చెందిన అర్జీలను కూడా స్వీకరిస్తామని తెలిపారు. అలాగే డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒ, మున్సిపల్ స్థాయిలో కమిషనర్లు, మండల స్థాయి అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఫిర్యాదులను కలెక్టరేట్‌లో స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు.

గూడు కట్టుకున్న నిరాశ

- సర్కారు సాయం చాలక సాగని నిర్మాణాలు
- నాలుగేళ్లయినా పూర్తిగాని జగనన్న కాలనీలు
- ప్రారంభోత్సవం కోసం హడావుడిగా తొలిదశ పనులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జగనన్న కాలనీ లబ్ధిదారుల్లో ఇల్లు నిర్మించలేక నిరాశ గూడు కట్టుకుంటుంది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన నాలుగేళ్లకు ఎట్టకేలకు మొదటి దశ నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఆలస్యానికి ప్రభుత్వ అలసత్వమే కారణమని లబ్ధిదారులు చెబుతున్నారు. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోకపోతే ఇచ్చిన స్థలాన్ని వెనక్కు తీసుకుంటామంటూ ప్రభుత్వం బెదిరించటంతో కొందరు అప్పులు తెచ్చి నిర్మాణాలను పూర్తి చేశారు. మరికొందరు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఎట్టకేలకు నిర్మాణాలను పూర్తి చేశారు. జిల్లాలో 'జగనన్న కాలనీలు పేదలందరికీ ఇళ్లు' పథకం కింద ప్రభుత్వం 68,074 ఇళ్ల స్థలాలను ఏడు నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు మంజూరు చేసింది. కొన్ని కాలనీలు నిర్మాణానికి అనువుగా లేకపోవడంతో లబ్ధిదారులు వెనకడుగు వేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం ఇచ్చే డబ్బు ఏ మూలకూ సరిపోవడం లేదు. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోవడానికి ఆసక్తి చూపడం లేదు.

వేమగిరి లేఅవుట్‌లో మెరక పనుల దశలోనే ఉన్న లేఅవుట్

ఇప్పటి వరకు బేస్‌మెంట్ స్థాయి కూడా దాటనివి 28,333 ఉన్నాయి. ఇక బేస్‌మెంట్ లెవెల్ వరకు వచ్చిన నిర్మాణాలు 10, 286 ఉన్నాయి. రూఫ్ లెవెల్ వచ్చినవి 2,059 కాగా ఇక అసలు మొదలుపెట్టని ఇంటి నిర్మాణాలు 418 ఉన్నాయి. పూర్తయిన ఇళ్ల20,237 మాత్రమే. దాదాపు 48,677 ఇళ ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి.

ఎట్టకేలకు తొలిదశ లక్ష్యం పూర్తి

జిల్లాలో ఎట్టకేలకు తొలి దశ లక్ష్యం పూర్తయింది. తొలి దశ లక్ష్యం 20,521 కాగా 20,237 పూర్తయ్యాయి. మిగిలిన 284 ఇళ్లరోజుల వ్యవధిలోనే పూర్తి కానున్నాయని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో పేదలందరికీ ఇళ్ల పథకం కింద జగనన్న కాలనీల్లో లక్ష మందికి పైగా లబ్ధిదారులకు ఇంటి పట్టాలు ఇచ్చారు. ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం లబ్ధిదారులకు మొదట మూడు ఆప్షన్లు ఇచ్చింది. లబ్ధిదారులు నిర్మించుకుంటే నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇస్తామని చెప్పింది. అవి సరిపోవని లబ్ధిదారులు వ్యతిరేకించడంతో డ్వాక్రా రుణాల ద్వారా మరో రూ.30 వేలు ఇవ్వడానికి నిర్ణయించింది. మొత్తం కలిపి రూ.2.10 లక్షలు అవుతున్నాయి. అయితే పెరిగిన స్టీలు, సిమెంటు, ఇసుక, కూలీల ఖర్చులతో లబ్ధిదారులకు నిర్మాణ భారం తడిచి మోపెడవుతోంది. బేస్‌మెంట్ లెవెల్ పూర్తి చేయడానికే రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతోంది. అంటే ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో పావు వంతు కూడా ఇంటి నిర్మాణం పూర్తి కాదు. ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే అదనపు ఖర్చును బ్యాంకుల ద్వారా ఇప్పించేందుకు చర్యలు తీసుకున్నామని ప్రభుత్వం చెబుతుండగా బ్యాంకులు మాత్రం నిబంధనల పేరుతో లబ్ధిదారులకు చుక్కలు చూపుతున్నాయి.

సామూహిక గృహ ప్రవేశాలకు కసరత్తు

జగనన్న లే అవుట్ లలో సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పలు మార్లు వాయిదాలు వేయటంతో విమర్శలు వెలువెత్తాయి. మరో ఏడాదిలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు చేయనున్నట్లు తెలుస్తోంది. జిల్లా స్థాయి కార్యక్రమంగా కాపవరం లేఅవుట్‌లో నిర్వహించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల హౌసింగ్ సిఇ జివి.ప్రసాద్ పర్యటించారు. కలెక్టర్ అధ్యక్షతన హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జగనన్న కాలనీలలో దళారులు చక్రం తిప్పినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన మొత్తంలోనే ఇల్లు పూర్తిగా నిర్మిస్తామంటూ దళారులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారు. ఆచరణలో రెండేళు గడిచినా నిర్మాణాలను పూర్తి చేయలేదని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. కొంతమంది పోలీస్ స్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. ఇల్లు కట్టుకునే స్థోమత లేక పోవటంతో దళారులను ఆశ్రయించామని చెబుతున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకుని అక్రమార్కులకు కళ్లెం వేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

బాధితుడు ప్రసాద్‌ను పరామర్శిస్తున్న దళిత సంఘాల నాయకులు

ప్రసాద్‌కు దళిత నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - చాగల్లు

విచారణ పేరుతో పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత యువకుడు చాగల్లు మండలం కుంకుడుమిల్లికి చెందిన వడ్డే వెంకటప్రసాద్‌ను ఆదివారం పలువురు దళిత నాయకులు పరామర్శించారు. ఒక మహిళ మిస్సింగ్ కేసులో విచారణ నిమిత్తం కడియం పోలీసులు వెంకటప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, మంచినీళ్లు అడిగితే మూత్రం తాగమన్నారని వెంకటప్రసాద్ మీడియా ముందుకు వచ్చి తెలిపిన విషయం విధితమే. అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో రాజమహేంద్రవరంలో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారని తెలిపాడు. దీనిపై దళిత సంఘాలు ఆందోళనతో జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పి సతీష్‌కుమార్ స్పందించారు. కడియం ఎస్ఐ శివాజీపై అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి విఆర్‌కి పంపించారు. ప్రస్తుతం చాగల్లులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో ప్రసాద్ చికిత్స పొందుతున్నాడు. ఆయన్ని పలువురు నాయకులు పరామర్శించారు. ఘటనా తీరును అడికి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్ల కార్యదర్శి జువ్వల రాంబాబు మాట్లాడారు. బాధితుడు ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. అతని కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో దళితులపై దాడులు, ప్రశ్నించే నాయకులపై అక్రమ కేసులు, అరెస్టులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో దువ్వాడ రాజా, కె.బుద్ధుడు, జి.సుబ్బారావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల వల్ల పంటలు ధ్వంసం

ప్రజాశక్తి - సీతానగరం

పశువుల వల్ల పంటలు ధ్వంస మవుతున్నాయని సీతానగరం మండలంలో లంక భూముల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీతానగరం లంకలో 60 ఎకరాల పంటలు నాశనమయ్యాయని వారు తెలిపారు. లంకలో అరటి తోటలు, జామ తోటలు, బొప్పాయి తోటలు, వరి, కూరగాయలు పండిస్తున్నారు. మండలంలో మునుకూడలి, వెదుళ్లపల్లి, ఇనుగంటివారి పేట, ముగ్గుళ్ల, రఘుదేవపురం, రాపాక గ్రామాల గేదెలు పంటలు ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు. సంబంధిత గ్రామాల గేదెల యాజమాన్యాలపై పంచాయతీల్లో చర్యలు తీసుకోవాలన్నారు. ఇరవై రోజులగా రైతులు కంటిమీద కునుకు లేకుండా రాత్రి పగలు కాపలా కాస్తున్నామన్నారు. రెండు రోజులుగా పంటలు ధ్వంసం చేస్తున్న గేదెలను సీతానగరం పంచాయతీ కార్యాలయం వద్ద నిలిపారు. పంచాయతీల్లో తీర్మానం చేసి గేదెలు పంటలు ధ్వంసం చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. పంటనష్టం వాటిల్లిన రైతులకు న్యాయం చేయాలన్నారు.

జామతోటలో ధ్వంసమైన జామ మొక్క

కాపలాదారులు విచ్చలవిడిగా గేదెలను లంకల్లో వదిలేస్తున్న యాజమాన్యాలపై సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతానగరానికి చెందిన రైతులు మట్ట శ్రీను, మట్ట నాగేశ్వరరావు, చినవరపు నాగేశ్వరరావు, జొన్నల పెద్ద బ్బులు, సంగిశెట్టి సీతారామయ్య, కోరసిక దుర్గయ్య, బోయిన దుర్గాప్రసాద్, జగత హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు సంతృప్త స్థాయిలో అందుతున్నాయని, ఇది ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పారదర్శక పాలనకు అద్దంపడుతోందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం కొవ్వూరు పట్టణంలో 21వార్డు అచ్చాయమ్మ కాలనీలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలపై బుక్‌లెట్‌ను పంచారు. పలు సమస్యల పరిష్కారం కోసం అధికారులకు అదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి తానేటి వనిత

రాజీవ్‌కు చాగల్లులో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా రాజీవ్ జయంతి..

ప్రజాశక్తి - తాళ్లపూడి

అధునాతన టెక్నాలజీని భారతదేశానికి పరిచయం చేసి యువతకు టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చిన ఘనత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అరిగెల అరుణకుమారి అన్నారు. మండలంలోని పెద్దేవంలో ఆదివారం జరిగిన రాజీవ్ గాంధీ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా అరుణకుమారి హాజరయ్యారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పంచాయతీ వ్యవస్థ ద్వారానే గ్రామాభివృద్ధి సాధ్యమని భావించి పంచాయతీరాజ్ వ్యవస్థ స్థాపించిన మహోన్నత వ్యక్తి రాజీవ్‌గాంధీ అని అన్నారు. పిసిసి డెలికేట్ గెడ్డం సాయిబాబా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాయన సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు : మెయిన్ బజార్‌లో రాజీవ్ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మట్టా సుబ్బారావు ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాలకుర్తి ప్రభాకర్ చౌదరి, పార్టీ ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు గల్లా భాస్కరరావు, నాయకుల కొక్కిరిపాటి బుల్లి స్వామి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఐ.సుబ్రహ్మణ్యం, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య కోసం నిరీక్షణ

- అర్హుల జాబితా సిద్ధం చేసిన యంత్రాంగం
- తాత్సారం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

'మిషన్ వాత్సల్య పథకం కోసం అభాగ్యులు ఆశగా ఎదురు చూస్తున్నారు. తల్లి,దండ్రులు లేని చిన్నారులకు సాయం అందిస్తామంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మిషన్ వాత్సల్య పథకం నేటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే ఈ స్థితికి కారణమని తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి నుంచి మిషన్ వాత్సల్య దరఖాస్తులు స్వీకరించారు. మేలో అధికార యంత్రాంగం జాబితా సిద్ధం చేసి రాష్ట్రా అందజేసింది. అయితే మూడు నెలలు కావొస్తున్నా నేటికీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ పథకం కోసం జిల్లా వ్యాప్తంగా 6,446 మంది తల్లి,దండ్రులు లేని అభాగ్యులు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక చేసి నిధుల కోసం కేంద్రానికి సిఫారుసు చేయాలి. దీనిపై ఐదు దశల్లో ప్రాథమిక కసరత్తు పూర్తి చేసి జిల్లా యంత్రాంగం రాష్ట్ర కేంద్రానికి పంపించినట్లు సమాచారం. అయితే కేంద్ర ప్రభుత్వం నేటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు ప్రతి నెలా ఆర్థిక సాయం అందుతుందనే ఆశతో బాధిత బాలలు నిరీక్షిస్తున్నారు.

అర్భాటంగా ప్రచారం

తల్లిదండ్రులను కోల్పోయినా, తల్లి లేదా తండ్రి లేకున్నా,విడాకులు పొందిన దంపతుల పిల్లలు - తండ్రి కుటుంబాన్ని విదిలేసిన వారికి - తల్లిదండ్రులు ప్రాణాపాయ వ్యాధుల బారిన పడినా - ప్రకతి వైపరీత్యాలకు గురైన బాలలు మిషన్ వాత్సల్యకు అర్హులని ప్రభుత్వం తెలిపింది. ఇటువంటి వారికి 18 ఏళ్ల నిండే వరకు నెలకు రూ. 4 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించింది. మహిళా పోలీసు, అంగన్‌వాడీ, ఆశాల సమన్వయంతో క్షేత్రస్థాయిలో దరఖాస్తులు స్వీకరించారు. తొలుత గడువు తేదీ నాటికి ధ్రువపత్రాల అందుబాటులో లేని కారణంగా అర్హులు సైతం దరఖాస్తులు చేసుకోలేకపోయారు. అనతరం గడవు తేదీ పొడిగించడంతో దరఖాస్తులు చేసుకున్నారు. అయితే వాత్సల్య పథకం ద్వారా లబ్ధి పొందే వారికి ప్రభుత్వం నుంచి ఇతర ఎలాంటి పథకాలు పొంది ఉండరాదని ఉన్నతాధికారుల నుంచి తాజాగా ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. అంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 13 వేలు అందుకుంటున్న వారిని వాత్సల్య పథకం నుంచి తొలగించాలని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం.

తాత్సారం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

కరోనా వైరస్ విజృంభణ నేపథ్యంలో అనేక కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. దీంతో ప్రజలు, ప్రజాసంఘాలు పాలకుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడంతో ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం దిగొచ్చింది. మిషన్ వాత్సల్య పథకం ప్రారంభించి అభాగ్యులను ఆదుకుంటామని తెలిపింది. ఈ నేపథ్యంలో అనాథలు ఎంతమంది ఉన్నారన్న దానిపై స్పష్టత వచ్చే వరకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దరఖాస్తులను స్వీకరించింది. దరఖాస్తులు స్వీకరించి నెలల గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలురాలేదని తెలుస్తోంది. దీంతో అనాథ పిల్లలు డబ్బుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఐసిడిఎస్ పీడీని ప్రశ్నించగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి ఉన్నతాధికారులకు అందజేశామని తెలిపారు. అర్హులందరికీ మిషన్ వాత్సల్య పథకం అందేలా చూస్తామని వివరించారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు-2023కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డిఇఒ ఎస్.అబ్రహాం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాలు, ఎపి రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ, అన్ని ఇతర యాజమాన్యాల(ప్రైవేటు తప్ప) పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దీనికి అర్హులన్నారు. కనీసం 10 ఏళ్ల బోధన అనుభవం గల, అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ. పురస్కారాలకు దరకాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి వెబ్ సైట్ deoeg.org లో నిబందనలు తదితర సమాచారం ఉందన్నారు. అర్హత గల ఉపాధ్యాయులు వెబ్ సైట్‌లో దరఖాస్తును పూర్తి చేసి ఈ నెల 25లోగా సంబధిత తనిఖీ అధికారుల ద్వారా డిఇఒ కార్యాలయంలో అందించాలని తెలిపారు.

వృద్ధునికి మానవతా ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లపూడి

భార్య పిల్లలు లేక ఒంటరిగా జీవిస్తున్న మండలంలోని పెద్దేవం గ్రామానికి చెందిన చిన్న గంగరాజు(85)కు మండల మానవతా శాఖ ఆదివారం ఆర్థిక సాయాన్ని అందజేసింది. సంస్థ గౌరవ అధ్యక్షులు సింహాద్రి జనార్ధనరావు రూ.2వేలు, మానవతా సంస్థ మరో రూ.3వేలు మొత్తంగా రూ.5వేలను వృద్ధునికి అందజేసింది. ఈ కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ మండల శాఖ అధ్యక్షులు సాయన సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ఎ.సురేష్, కార్యదర్శి తిగిరిపల్లి దోసయ్య, రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, పూర్వపు అధ్యక్షులు టిఎన్‌బి.గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, పోలవరం మాజీ ఎంఎల్‌ఎ ఎం.శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు వల్లూరి సత్యనారాయణ తదితరులు సందర్శించుకున్నారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ప్రపసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మల్లెపూడి ట్రస్ట్ ద్వారా బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం మల్లవరంలో ఆదివారం 17 నిరుపేద కుటుంబాలకు మల్లిపూడి ట్రస్ట్ ద్వారా సర్పంచ్ కోడూరు లక్ష్మీసుభాషిణి చేతుల మీదుగా బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోడూరు కాశి గంగాధర్‌రావు, గల్లా భాస్కరరావు, అయినం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు మల్లిపూడి ధనరాజ్ తెలిపారు.

బియ్యం అందిస్తున్న మల్లెపూడి ట్రస్టు సభ్యులు, సర్పంచ్

నేడు ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆద్వరంలో సోమవారం నుంచి ఈ నెల 24 వరకూ సైకిల్ యాత్రను నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కోటిపల్లి బస్టాండ్ నుంచి యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పాఠ్యపుస్తకాలను ఉచితంగా పంపిణీ చేయాలని, మిడ్డే మీల్స్‌ను నిర్వహించాలని, కళాశాలల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఎస్‌కెవిటి విద్యాసంస్థలకు నాడు-నేడు నిధులు విడుదల చేయాలని, ఎస్‌కెవిటి జూనియర్ కళాశాలను ప్రభుత్వ కళాశాలగా గుర్తిస్తూ జిఒ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని, జిఒ 77, 107, 108లను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో ఈ యాత్రను చేపడుతున్నామని తెలిపారు.

కార్టూ'నిజం'



వాస్తు పేర అడ్డగోలు నిర్మాణాలు

- కచ్చా డ్రెయిన్ల తవ్వకాలతో ప్రజల ఇబ్బందులు
- అధికారి నిర్వాకంతో నిరుపయోగంగా పార్కింగ్ షెడ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వాస్తు పేరుతో ఇరిగేషన్ శాఖలో ఒక ఉన్నత స్థాయి అధికారి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. అడ్డగోలుగా తవ్వకాలను నిర్వహించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ సమీపంలో ఇరిగేషన్ కార్యాలయాలు ఉన్నాయి. స్థానికంగా ఉన్న జలవనరుల శాఖ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఒక ఉన్నత స్థాయి అధికారి వాస్తు పేరుతో ఐదు దశాబ్దాలుగా ఉన్న కార్యాలయ రూపురేఖల్ని మార్చేశారు. ఈ కార్యాలయంలోకి వెళ్లే ప్రధాన ద్వారాన్ని మూసేసి గోడ నిర్మించారు. ఐదు దశాబ్దాలకు పైగా ఈ కార్యాలయంలోకి వెళ్లాలంటే ఇదే ప్రధాన ద్వారంగా ఉంది. ఎంతో మంది ఎస్ఇలు ఇతర అధికారులు ఇందులో విధులు నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించారు. కాని ఇటీవల వచ్చిన ఒక అధికారి మాత్రం ఇష్టాను సారంగా కార్యాలయం రూపురేఖల్ని మార్చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారి వైపున ఉన్న ప్రధాన ద్వారాన్ని మూసేసిన అధికారి కార్యాలయం వెనుక భాగం నుంచి ద్వారాన్ని తెరిచారు. ఇంత వరకూ బాగానే ఉంది. వెనుకవైపున పల్లంగా ఉండటంతో వర్షపునీరు వెళ్లేందుకు ఇష్టాను సారంగా కచ్చా డ్రెయిన్లను తవ్వించారు. గతంలో బ్యారేజీ కాలనీలో చిన్నారులు ఆడుకునేందుకు ఇక్కడ ఉన్న చిన్నపాటి ఆటస్థలం ఉంది. ఇందులో క్రికెట్, ఇతర ఆటలు వారు ఆడుకునేవారు.గతంలో ఇరిగేషన్ అధికారులు సైతం సాయంత్రం వేళ వాలీబాల్, టెన్నికాయిట్ వంటి ఆటలు ఇదే స్థలంలో ఆడుకునేవారు. ఇటీవల సదరు అధికారి ఆటస్థలం మధ్యగా మీటరున్నర వెడల్పున కచ్చా డ్రయిన్‌ను తవ్వించాడు. దీంతో వారంతా ఆటలకు దూరమయ్యారు. అంతేకాకుండా ఇదే ఆటస్థలాన్ని ఆనుకుని ఒక స్టేజీ, గ్రంథాలయం భవనం, ఇరిగేషన్‌కు సంబంధించిన ఆడిటోరియం ఉన్నాయి. ఇక్కడ గ్రంథాలయానికి నిత్యం పాఠకులు వస్తూంటారు. అంతేకాకుండా ఆడిటోరియంలో వివిధ శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆడిటోరియంలో ఉన్న షటిల్ కోర్టులో గ్రామానికి చెందిన యువకులు, ఇరిగేషన్ ఉద్యోగులు సైతం ఆడుకునేందుకు వస్తుంటారు. ఆడిటోరియానికి వెళ్లే దారిలో సదరు అధికారి కచ్చా డ్రెయిన్‌ను తవ్వించారు. ఫలితంగా గ్రంథాలయానికి వెళ్లే పాఠకులు, ఆడిటోరియానికి వెళ్లే ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాల వేళ పరిస్థితి మరీ దయణీయంగా ఉంటుందని, డ్రెయిన్‌ను దాటే సందర్భంలో పడిపోతున్నామని గ్రంథాలయాలకు వస్తున్న సీనియర్ సిటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆడిటోరియం వద్ద ఏవైనా శుభకార్యాలు నిర్వహించుకునే సందర్భంగా కచ్చా డ్రెయిన్ అడ్డంకిగా మారిందని పలువురు చెబుతున్నారు. మరోవైపు తూర్పు వైపున ద్వారం తెరిచిన సమయంలో నాలుగు మీటర్ల వెడల్పున మట్టిని తవ్వేశారు. దీంతో పెద్ద గుంతలా ఏర్పడింది. గుంతకు ఆవల ఇరిగేషన్ ఉద్యోగుల వాహనాల పార్కింగ్ నిమిత్తం షెడ్డును నిర్మించారు. ఈ ద్వారం తెరవక ముందు ఇరిగేషన్ అధికారులు తమ వాహనాలను షెడ్డులో పార్క్ చేసుకునేవారు. ప్రస్తుతం ఇక్కడ మట్టిని తవ్వేయడంతో షెడ్డులో వాహనాలను పార్కింగ్ చేసుకునే అవకాశం లేక ఉద్యోగులు సర్కిల్ కార్యాలయం వెలుపలనే పార్క్ చేసుకోవల్సి వస్తుంది. అధికారి నిర్వాకం కారణంగా లక్షలతో నిర్మించిన వాహనాల షెడ్డు నిరుపయోగంగా మారింది. ఉన్నత స్థాయి అధికారి కావడంతో ఆయనపై ఎవరూ ఫిర్యాదు చేసే పరిస్థితి లేక నిమ్మకుంటున్నారనే వార్తలు ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు స్పందించి అడ్డగోలు తవ్వకాలను మూసేయాలని, కార్యాలయం ద్వారం యథావిధిగా రహదారి వైపు తెరిపించాలని పలువురు కోరుతున్నారు.

గ్రంథాలయానికి వెళ్లే దారిలో, ఆటస్థలంలో అడ్డంగా తవ్విన కచ్చా డ్రెయిన్

ప్రధాన రహదారివైపు మూసేసిన కార్యాలయం ప్రధాన ద్వారం

కార్యాలయం వెనుకవైపున తెరచిన ద్వారం(నిరుపయోగంగా మారిన షెడ్ వృత్తంలో)

నేరాలు ఘోరాలు

ప్రమాదంలో గాయపడిన యువకుడు

కారు స్తంభాన్ని ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి గ్రామ శివారున జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొనడంతో కారు ముందుభాగం నుజ్జు నుజ్జయ్యి కారులో ఉన్న వై.సూరిబాబు, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కారులో సుబ్బయంపేట నుంచి రాజమహేంద్రవరం శుభకార్యానికి వెళుతుండగా మల్లేపల్లి గ్రామ శివారు పెట్రోల్ బంకు సమీపం వచ్చేసరికి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొంది. సమాచారం తెలుసుకున్న స్థానికులు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి-కొత్తపేట

గాయపడి చికిత్స పొందుతూ మహిళ మృతి చెందినట్లు కొత్తపేట ఎఎస్.ఐ డి.శశాంక తెలిపారు. మండల పరిధిలోని ఏనుగుల మహల్ సలాది వారి వీధికి చెందిన సలాది ధనలక్ష్మి (45) గత నెల 29న గత సంవత్సరంలో మిగిలిపోయిన చిచ్చుబుడ్డిలను వెలిగించారు. ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో ఆమె గాయపడ్డారు. దీంతో కుటుంబసభ్యులు రావులపాలెంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తీసుకువెళ్లారు. అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు అదనపు ఎస్.ఐ తెలిపారు.

సభలో ప్రసంగిస్తున్న మట్టే శ్రీనివాస్

అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శ్రీలలిత ఎంటర్‌ప్రైజెస్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాస్ అన్నారు. స్థానిక మట్టే ఆదినారాయణ, నాగమణి ఆర్యవైశ్య సేవా సంఘం కళ్యాణ మండపంలో ఆదివారం ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అందరికీ ఉచితంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ వైద్య శిబిరాన్ని పట్టణ ప్రజలే కాక పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సభలో మట్టే ఆదిశంకర్, వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కాకి మణికంఠ కుమార్, ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎం.శ్రీనివాస్, గ్రంధి గోపాల్, శ్రీరాం ప్రకాష్ ప్రసంగించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై డాక్టర్లు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో వాసవి క్లబ్ సభ్యులు, వనితా సభ్యులు, యువజన సేవా సంఘ సభ్యులు సేవలందించారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న నాయకులు

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

గాడిమొగ పంచాయతీ బాబా నగర్ గ్రామానికి అధికారికంగా శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్, బిఎస్‌పి అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడు వాకపల్లి భీమారావు డిమాండ్ చేశారు. గాడిమొగ పంచాయితీ బాబానగర్ వాసులకు శ్మశాన వాటిక లేదని, కొన్ని రోజుల క్రితం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో బాబా నగర్‌కు అర కిలోమీటర్ దూరంలో ప్రభుత్వ భూమిని శ్మశాన వాటికకు వాడుకునేందుకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. గాడిమొగ గ్రామస్తులు అభ్యంతరాలు తెలపకుండా పూర్తిస్థాయిలో సరిహద్దులు నిర్మించి స్థలాన్ని అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాత సుబ్రహ్మణ్యం, మోకా దుర్గా ప్రసాద్, తాడి షణ్ముఖరాజు, కమిడి శ్రీను, కుసుమ శ్రీనువాస్, దడాల శ్రీనివాస్, మోర్త విజయ్, చందు. గల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక స్పందన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో జిల్లాస్థాయి సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకుని రావచ్చునని అన్నారు. అర్జీలకు వచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన అర్జీదారులకు విజ్ఞప్తి చేశారు.

మాతా శిశు మరణాల నివారణకు చర్యలు

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అరుణ

ముఖాముఖి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మాతా, శిశు మరణాలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా తల్లీబిడ్డల సంరక్షణకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వి.అరుణ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవల్లో ఈ కార్యక్రమం అత్యంత కీలకమైనదన్నారు. వివాహమైన నాటి నుంచి కుటుంబ నియంత్రణ, శస్త్ర చికిత్స వరకు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలపైనే ప్రజలు ఆధారపడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అమలవుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమం గురించి ప్రజాశక్తికి ఆమె పలు అంశాలను వివరించారు.

ఇమ్యునైజేషన్ కోసం ఎవరిని సంప్రదించాలి.?

వివాహ అనంతరం తొలి గర్భం దాల్చిన తర్వాత ఆరోగ్య కార్యకర్తల వద్ద టీకాల కోసం నమోదు చేసుకోవాలి. నమోదైన ప్రతి మహిళకూ వైద్య ఆరోగ్యశాఖ కార్యకర్తలిచ్చే ఎంసిపి కార్డు తప్పనిసరి. ఈ కార్డు ఆధారంగానే గర్భవతి మొదలు పుట్టిన పిల్లలకు ఏడాదిన్నర వచ్చేంతవరకు వారికి అందించే వ్యాధి నిరోధక టీకాలు, ఇతర ఆరోగ్య వివరాలు అందులో నమోదు చేసేందుకు వీలవుతుంది. దీని ఆధారంగానే టీకాలు వేస్తారు. అలాగే ప్రతి గర్భిణులు వివరాలను ఆరోగ్య కార్యకర్త, ఆశ తప్పనిసరిగా నమోదు చేసుకుని వారికి సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా కాన్పు సుఖంగా జరగడానికి తోడ్పడుతుంది. దీనికి తోడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖంగా కాన్పు నిర్వహించేందుకు ఆసక్తి పెరుగుతోంది.

టీకాల కార్యక్రమం వివరాలు తెలియజేయండి.?

జిల్లాలో ప్రతి సంవత్సరం యూనివర్సల్ ఇమ్యునైజేషన్ కార్యక్రమం జరుపుతున్నాం. జిల్లాలో 22 లక్షల 47 వేల 860 మంది జనాభా ఉన్నారు. వీరిలో సున్నా నుంచి ఐదేళ్ల లోపు సుమారు 2 లక్షల మంది పిల్లలు ఉండగా వీరికే ఎక్కువగా టీకాలు వేయాల్సి ఉంటుంది. జిల్లా మొత్తంగా 2 వేల పాయింట్లలో కాకినాడ జిజిహెచ్, 2 ఏరియా ఆసుపత్రులు, 10 సిహెచ్‌సిలు, 44 పిహెచ్‌సిలు, 23 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 635 ఆరోగ్య సచివాలయాలు ద్వారా పిల్లలందరికీ టీకాలు వేస్తున్నాం.

ఏయే టీకాలు ఎలా వేస్తున్నారు.?

పిల్లలు పుట్టగానే డిసిజి టీకా, 14 రోజుల తర్వాత పోలియో నిర్మూలనకు ఒపివి జీరో డోస్, పుట్టిన 24 గంటల లోపు పచ్చకామెర్ల నివారణకు హెపటైటిస్ బి టీకా, ధనుర్వాతం, కంఠసర్పి, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు ఒకే పెంటావేలెంట్ టీకాను 6, 10, 14 వారాలలో 3 డోసులు వేస్తారు. దీంతో పాటు పోలియోకి సంబంధించిన ఒపివి, ఐపివి టీకాలు కూడా వేస్తారు. విరేచనాల తగ్గుదలకు 6, 10, 14 వారాల పిల్లలకు రూటా వైరస్ డ్రాప్స్ లను వేస్తాము. 9 నెలలు నిండిన తర్వాత తట్టు వ్యాధి, పొంగు వ్యాధి రాకుండా మీజుల్స్, రూబెల్లా(ఎంఆర్) రెండు టీకాలను, 2వ డోసు మరలా 18 నెలలకు వేస్తున్నాం. దీంతో పాటు విటమిన్ ఎ సిరప్ కూడా వేస్తున్నాం. ప్రతి 6 నెలలకొకసారి 5 ఏళ్ల వరకూ 9 డోసులు విటమిన్ సిరప్ ఇస్తున్నాం.10వ ఏట, 16వ ఏట టిటి వేస్తున్నాం. రెండేళ్ల పిల్లలకు డిఫ్తీరియా వ్యాక్సిన్ వేస్తున్నాం. ఇలా 16 ఏళ్లు పూర్తయ్యే వరకూ పిల్లలకు పూర్తి ఇమ్యునైజేషన్ చేస్తున్నాం. అలాగే ప్రతి సంవత్సరం జనవరిలో పల్స్ పోలియో వ్యాక్సిన్ కార్యక్రమం విధిగా నిర్వహిస్తున్నాం.

టీకాలు వేసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.?

వ్యాధి నిరోధక టీకాలు వేసే సమయంలో ఆరోగ్య కార్యకర్తలు తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. కరోనా వైరస్ వ్యాప్తి తరువాత నుంచి టీకాలు వేసే సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. తప్పనిసరిగా మాస్క్ ధరించడంతో పాటు చేతులకు గ్లౌజులు ధరించాల్సి ఉంటుంది. వాక్సినేషన్ సమయంలో భౌతిక దూరాన్ని పాటించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వాక్సిన్ వేసిన ప్రతిసారీ శానిటైజర్‌ను తప్పక పూసుకోవాల్సి ఉంటుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి వీటిని తీసుకున్న తర్వాత మాత్రమే వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం.

మాతా, శిశు మరణాల రేటును తగ్గించేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.?

తల్లీ బిడ్డలు క్షేమంగా ఉంటే అందరికీ సంతోషం. అందుకే మాతా,శిశువు ఆరోగ్యంపై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యతగల అంశాల్లో మాతాశిశు సంరక్షణ ఒకటి. పునరుత్పత్తి, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. అందువల్లే ఆస్పత్రి కాన్పులపై మహిళల్లో అవగాహన కల్పించడం జరుగుతోంది. గతంలో ఊళ్లలోనే తాత్కాలిక వైద్యులు, పురుడుపోసే వారి సాయంతో కాన్పు జరిపించేవారు. ఆ సమయంలోనే సరైన వైద్యం అందక మాతాశిశు మరణాలు ఎక్కువగా సంభవించేవి. ఊళ్లలో ప్రసవానికి వైద్యం అందుబాటులో ఉండక అప్పట్లో అనేక విధానాలు అవలంబించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వాస్పత్రుల్లో ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అందుకే ఇంటి వద్ద ప్రసవం కంటే ఆస్పత్రిలో ప్రసవాలే మంచిదని ప్రజల్లో అవగహన కల్పించడం జరుగుతోంది. అందుకోసం జనని సురక్ష యోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా పేదకుటుంబానికి చెందిన గర్భం దాల్చిన మహిళలకు వైద్య సేవలతో పాటు ఆస్పత్రిలో ప్రసవానికి వచ్చేలా ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోంది.

మాట్లాడుతున్న శ్రీనివాస్

పట్టాదారులకు దస్తావేజులు ఇవ్వండి

ప్రజాశక్తి - పెద్దాపురం

వన్ టైం సెటిల్మెంట్ పేరుతో ఇంటి పట్టాలు ఉన్నవారికి పూర్తిస్థాయి హక్కులతో దస్తావేజులు ఇస్తామని చెప్పి ఒక్కొక్కరి వద్ద నుండి రూ.15 వేలు వసూలు చేసి సంవత్సరం గడిచినా ఇప్పటివరకు వారికి దస్తావేజులు ఇవ్వకపోవడం అన్యాయమని సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం రొంగల వీర్రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దస్తావేజులు ఇవ్వకపోతే కట్టిన రూ.15 వేలు ఇవ్వాలని పట్టాదారులు విజ్ఞప్తి చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పట్టాదారులు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. అధికారులు వన్ టైం సెటిల్మెంట్ నిమిత్తం రూ.15 వేలు చెల్లించిన వారందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, దారపురెడ్డి కృష్ణ, రొంగల సుబ్బలక్ష్మి, నెక్కల నరసింహమూర్తి, గరగపాటి పెంటయ్య, యాసలపు రమేష్ పాల్గొన్నారు.

మహిళలకు అండగా టిడిపి మహాశక్తి

ప్రజాశక్తి-పెదపూడి

తెలుగుదేశం పార్టీ మహానాడులో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన మ్యానిఫెస్టోలో మహిళల కోసం ప్రకటించిన మహాశక్తి పథకం ద్వారా మహిళలకు అద్భుతమైన లబ్ధి చేకూరుతుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జుత్తుక సూర్యకుమారి అధ్యక్షతన అచ్యుతాపురత్రయం గ్రామంలో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫేస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి పథకాలు ఎటువంటి ఆంక్షలూ, కోతలూ లేకుండా అర్హులందరికీ పూర్తి స్థాయిలో అందిస్తామన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత పథకాలలో ఏవిధంగా కోత విధిస్తున్నారో వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ అధికార ప్రతినిధి బేరా వేణమ్మ, జిల్లా మహిళా అధ్యక్షులు శేషారత్నం, మండల అధ్యక్షురాలు సత్యవతి, సుభాషిణి, పుట్టా గంగాధర చౌదరి, జుత్తుక కృష్ణ, బదిరెడ్డి చిట్టిబాబు, సానా శ్రీను పాల్గొన్నారు.

యానాం వార్తలు

బైక్‌పై దేశాన్ని చుట్టిన యానాం యువకుడు

ప్రజాశక్తి - యానాం

కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అనేదానికి గుర్రాల రేవంతసాయి ఒక నిదర్శనంగా చెప్పవచ్చు. 19 ఏళ్ల వయస్సులో మూడున్నరేళ్లు పాటు బైక్‌పై దేశాన్ని చుట్టివచ్చాడు. యాత్రలో ఎదురైన ఎన్నో అవరోధాలను, అవాంతరాలను అధిగమించి తను అనుకున్న లక్ష్యాన్ని సాకారం చేశాడు. యానాంకు చెందిన రేవంతసాయి భారత భూభాగం అంతా బైకుపై చుట్టిరావాలన్న ధృడ సంకల్పంతో 2020 ఫిబ్రవరి 10న ప్రారంభించిన బైక్ యాత్ర 2023 ఈ నెల 14తో ముగిసింది. విశాఖ, ఒడిశా, చత్తీస్‌గడ్ మీదుగా సాగిన బైక్ యాత్ర ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తర, దక్షిణ భారత రాష్ట్రాలను లడక్, కాశ్మీర్‌ను చుట్టి...ఎన్నో ప్రదేశాలను తిలకిస్తూ, నేతలను కలుస్తూ, ఫిట్ ఇండియాపై అవగాహన కల్పిస్తూ సాగాడు. ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని విజయవంతంగా యానాం చేరుకున్నాడు. యాత్ర ముగింపు దశలో బైకుపై నుంచి జారిపడి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. సాహసం, ధైర్యంతో యాత్ర చేసిన సాయిని పలువురు అభినందించారు.

సెప్టెంబర్ 24న రామానుజన్ పరీక్ష

ప్రజాశక్తి - యానాం

రామానుజ గణిత అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే రామానుజన్ పరీక్ష సెప్టెంబర్ 24 నిర్వహించనున్నట్లు రామానుజన్ గణిత అకాడమీ యానాం శాఖ అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్ష నాలుగో తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు మాత్రమే నిర్వహిస్తారన్నారు. పరీక్ష ఫీజును ఆగస్టు 30లోగా చెల్లించాలని కోరారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

ప్రజాశక్తి - యానాం

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని స్థానిక సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఫెర్రీ రోడ్డు రాజీవ్ పార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖండవల్లి రామకష్ణ, ఎస్‌పి రఘునాయగం, సిఐ షణ్ముగం, స్పెషల్ బ్రాంచ్ ఎఎస్ఐ రమణమూర్తి, కెఎల్‌వి.ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కనకాల పేట ఏటిగట్టు రోడ్డు దుస్థితి

రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన మొక్కలు

ప్రజాశక్తి - యానాం

యానాం బైపాస్ నుంచి కనకాల పేటకు వెళ్లే ఏటిగట్టు రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు బాగా పెరగడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డ్ నుంచి దట్టమైన పొగ రావడంతో ఆ సమయంలో రోడ్డును పూర్తిగా పొగ కమ్మేయడంతో రోడ్డు కనిపించగా వాహనాదారులు మొక్కల్లోకి చొచ్చుకుపోయి ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ మొక్కల నుంచి పాములు బయటకు రావడంతో పాదాచారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తి కానీ అప్రోచ్ రోడ్డు

నిరుపయోగంగా మారిన రెండవ వంతెన

ఎదురెదురు వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం

ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రాని వంతెన

- పూర్తికాని అప్రోచ్ రోడ్డు పనులు
- ప్రయాణికులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు
- పూర్తిచేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-మండపేట

పట్టణ ముఖ ద్వారం వద్ద ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించడంలో భాగంగా పెద్దకాలువ వంతెన చెంతనే నిర్మించిన రెండవ వంతెనకు ఇరువైపులా చేపట్టిన అప్రోచ్ రోడ్డు పనులు ఏళ్ల గడుస్తున్న పూర్తికాకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

జలవనరుల శాఖ ఆధ్వర్యంలో రూ.86 లక్షల అంచనాలతో గోదావరి డెల్టా ఆధునికీకరణలో భాగంగా చేపట్టిన అప్రోచ్ రోడ్డు పనులకు ఇప్పటి వరకు రూ.60 లక్షల నిధులను ఖర్చు చేశారు. మిగిలిన రూ.11 లక్షలకు పనులు జరగాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. పనులు పూర్తి కాకపోవడంతో వంతెన నిరుపయోగంగా మారిడంతో వాహనదారులు ఒక వైపు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో తరచు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అంతేకాకుండా పాత వంతెన రెయిలింగ్ విరిగిపోయి ప్రమాదాలను తలపిస్తోంది.

ఈ విషయంపై రామచంద్రపురం సెక్షన్ ఇఇ రామకృష్ణను వివరణ కోరగా అప్రోచ్, బిటి రోడ్డు పనులు పూర్తి చేయాల్సి ఉందని కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో ఈ పనికి సంబంధించిన అగ్రిమెంటు పూర్తి అయ్యిందన్నారు.

పనుల్లో జాప్యంతో ఇబ్బందులు

వంతెనల నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొనడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. ట్రాఫిక్ సమస్య తీరకపోగా అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో కాలుష్య సమస్య అధికమవుతోంది. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప పనులు పూర్తి కావడం లేదు. అప్రోచ్, రోడ్డు పనులు పూర్తి చేసి వంతెనను వినియోగంలోకి తీసుకురావాలి.

-అప్పరబోతు దుర్గాప్రసాద్, స్థానికుడు

తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం

పనులు పూర్తి కాకపోవడంతో వంతెన నిరుపయోగంగా మారింది. దీంతో వాహనదారులు ఒక వైపు రాకపోకలు సాగిస్తుండటంతో తరచు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ఈ సమస్యపై తక్షణం స్పందించి చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నా.

-కోన సత్యనారాయణ, బిసిసంఘ నాయకులు

కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రయివేటు పెత్తనం

- శృతిమించుతోన్న సెక్యూరిటీ గార్డుల ఓవరాక్షన్
- అసభ్యపదజాలంతో రోగులు, వారి బంధువులను దూషిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది
- ప్రశ్నించిన వారిపై కర్రలతో విచక్షణారహితంగా దాడి..

ప్రజాశక్తి-కాకినాడ కార్పొరేషన్

కాలు కిందపెడితే తొక్కేస్తా..నీ అయ్య జాగీర ఎక్కడపడితే అక్కడ పడుకుంటున్నావ్..ఒకటి కాదు రెండు కాదు ఎవరిని పడితే వారిపై నోటి దురుసు ప్రవర్తనతో సామాన్య ప్రజలను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నారు. ఇది ఎక్కడో కాదు మన కాకినాడ సామాన్య ప్రభుత్వ ఆసుపత్రిలోనే..అక్కడ సెక్యూరిటీ సిబ్బంది తీరు ఇది.. అయితే ఇదంతా అక్కడ ఉన్న ప్రధాన కాంట్రాక్టర్ ఒకరు చూసుకునిరెచ్చి పోతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిని తన గుప్పెట్లో ఉన్నట్లు అందరితో చెప్పుకుంటూ,అక్కడ చేసే ప్రభుత్వ ఉద్యోగులు కూడా అతనికి సలాం కొట్టకపోతే సెక్షన్లో మార్చేస్తానట్లు పెత్తనం సాగించడం వల్లే సామాన్య ప్రజలను సెక్యూరిటీ సిబ్బంది తీవ్ర ఇబ్బందికి గురి చేస్తున్నట్లు సామాన్య ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అది కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి.. నిత్యం కొన్ని వేల మంది రోగులు ఇక్కడికి వైద్య సేవల కోసం వస్తుంటారు. వారిలో కొందరు ఇన్‌పేషంట్లుగా ఉంటే.. మరికొందరు ఔట్ పేషంట్లుగా ఉంటారు. నిత్యం ఒపి విభాగం మధ్యాహ్నం ఒంటి గంట వరకు కిటకిటలాడుతూనే ఉంటుంది. వివిధ ఆనారోగ్య సమస్యలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులతో పాటు, పశ్చిమ గోదావరి జిల్లా వాసులు కూడా ఇక్కడికి వస్తుంటారు. అయితే ఇక్కడ రోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. ముఖ్యంగా సెక్యూరిటీ సిబ్బంది నిర్వాకంతో రోగులు బెంబేలెత్తిపోతున్నారు. తమ బంధువులకు ఏమైందో, వారి ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకుందామని ఆత్రుతగా వస్తున్న వారిపై కర్ర పెత్తనం చెలాయిస్తున్నారు. ముఖ్యంగా నోరు పారేసుకుంటూ.. ఇష్టమొచ్చిన మాట్లాడుతున్నారని పలువురు వాపోతున్నారు. ఏదో జిజిహెచ్ మొత్తం వీరి సొంత జాగీరులా ఫీలవుతూ.. నిరుపేద రోగులపై రెచ్చిపోతున్నారు. ఏయ్ ఓయ్ వంటి మాటలేకాదు.. ఏరా? పోరా అంటూ చెలరేగిపోతున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై సెక్యూరిటీ గార్డులు మూకుమ్మడిగా దాడులు చేస్తున్నారు. రోగుల బంధువులను తాగుబోతులుగా చిత్రీకరించి నోరేసుకుని పడిపోతున్నారు. అయితే మహిళా సెక్యూరిటీ గార్డుల రుబాబు మరీ దారుణం. మగాళ్లపై తీవ్రపదజాలంతో రెచ్చిపోతూ.. అవసరమైతే కేసులు కూడా పెట్టేస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా కేసులు అధికమయ్యాయని పలువురు వాపోతున్నారు. అంతే కాదు "మాతో గొడవ పడితే.. నువ్వు జిజిహెచ్ దాటి బయటకు వెళ్లగలవా?". అంటూ బెదిరింపులకు కూడా దిగుతున్నారం టున్నారు. మీ పేషంట్ల సంగతి తేలుస్తామని, వారికి వైద్యం అందకుండా చేస్తామని కూడా కొంత మంది సెక్యూరిటీ సిబ్బంది వార్నింగ్లు ఇస్తున్నారని రోగులు వాపోతున్నారు. ఒక్కసారిగా సెక్యూరిటీ సిబ్బంది అందరూ ఏకమై రోగులు, వారి బంధువులపై మూకుమ్మడి దాడి చేస్తుండడంతో ఎవరూ నోరు మెదపలేని పరిస్థితి ఎదురవుతోంది. రోగుల పట్ల సెక్యూరిటీ గార్డులు వ్యవహరిస్తున్న తీరుపై జిల్లా కలెక్టర్ కతికా శుక్లా జీజీహెచ్ ఉన్నతాధికారులకు క్లాస్ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

కర్రతో దాడి చేస్తున్న వైనం..

పెరుగుతున్న చోరీలు.

జీజీహెచ్ మొత్తం ప్రైవేటు సెక్యూరిటీ చేతుల్లో ఉన్నా.. అక్కడ దొంగతనాలు మాత్రం తగ్గడం లేదు. పైకి తామంతా ఏదో దొంగతనాలను అరికట్టేసినట్టు బిల్డప్ ఇస్తున్న ఈ సెక్యూరిటీ సిబ్బంది తమ సొంత పనులకు జిజిహెచ్‌ను వాడేసుకుంటున్నారు. అంతే కాదు.. రోగులను డబ్బుల కోసం కూడా పీక్కొని తింటున్న సంఘటనలూ నిత్యకత్యమే. గత కొన్ని రోజులుగా బైక్ దొంగతనాలు జరుగుతున్నాయి. వీటిని అరికట్టడంలో జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బందితో పాటు, అవుట్ పోస్టు పోలీసులు కూడా ఫెయిలైనట్టు రోగుల బంధువులు చెబుతున్నారు.

'టిడిపితోనే మహిళా సంక్షేమం సాధ్యం'

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మహిళల సంరక్షణతోపాటు సంక్షేమం టిడిపితోనే సాధ్యం అవుతాయని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నవర గ్రామంలో టిడిపి ఆధ్వర్యాన చేపట్టిన మహిళా శక్తి ప్రచార కార్యక్రమంలో ఎంఎల్ఎ చినరాజప్ప ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత గ్రామంలో వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పూజలు చేపట్టారు. అనంతరం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి మహిళా శక్తి ప్రచార కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి చేపట్టారు. ఇటీవల టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన మహిళా సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనువాసు, పనసపాడు గ్రామ సర్పంచి చీకట్ల వెంకటేష్, వెన్నా దివాణం, శిద్దు నూకరాజు, తోట నాగబాబు, కె శ్రీను, అగ్గిరాముడు, బొందల రామలక్ష్మి, మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.